క్లుప్తంగా

చురుగ్గా రహదారి పనులు



సంజీవయ్యనగర్‌లో పూర్తయిన బీటీ రోడ్డు

గోపాలపట్నం: జీవీఎంసీ 52వ వార్డు సంజీవయ్యనగర్‌లో 80 అడుగుల రహదారి పనులు చురుగ్గా సాగుతున్నాయి. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.60 కోట్లతో ఈ రహదారి నిర్మిస్తున్నారు. ఇటీవల సెంటర్ డివైడర్ నిర్మాణం పూర్తయింది. రాత్రి బీటీ రోడ్డు పనులు పూర్తి చేశారు. ఇక సెంటర్ డివైడర్ సుందరీకరణ పనులు చేపట్టనున్నారు. ఈ పనులు పూర్తయితే ఈ రహదారి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సంజీవయ్యనగర్ నుంచి మర్రిపాలెం వుడాలేఅవుట్ కమ్యూనిటీ హాలు వరకు ఈ రోడ్డు అభివృద్ధి చేస్తున్నారు.

యువకుడి అదృశ్యం



ఫణిభూషణ్ నాయక్

గోపాలపట్నం: ఒడిశాకు చెందిన యువకుడు ఫణిభూషణ్ నాయక్ ఈ నెల 1న అదృశ్యమయ్యాడు. ఎయిర్‌పోర్టు పోలీసులు తెలిపిన వివరాలు.. ఎన్ఎస్టీఎల్‌లో విధులు నిర్వహిస్తున్న దిలీప్ కుమార్ నాయక్ తమ్ముడైన ఫణిభూషణ్ నాయక్‌కు వైద్యం చేయించేందుకు ఇటీవల తన ఇంటికి తీసుకు వచ్చాడు. శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటలకు బయటకు వెళ్లి వస్తానని ఇంటి వద్ద చెప్పి బయటకు వెళ్లాడు. ఎంతకీ ఇంటికి రాకపోవడంతో చుట్టు పక్కలంతా వెతికారు. ఆచూకీ దొరక్కపోవడంతో ఎయిర్‌పోర్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అతన్ని గుర్తించిన వారు ఎయిర్‌పోర్టు పోలీసులకు సమాచారం అందివ్వాలని కోరారు.

కోలుకున్న యువతి అప్పగింత



కొండమ్మను అమ్మమ్మకు అప్పగిస్తున్న ఏయూటీడీ ప్రతినిధి వాసు

అల్లిపురం: మే 31న మహారాణిపేట పోలీసులు శ్రీకాకుళం జిల్లా, కోట బొమ్మాళి మండలం, లోకంది గ్రామానికి చెందిన బొత్తరా కొండమ్మ అనే యువతి ఫిట్స్‌తో రోడ్డుపై పడి ఉండటాన్ని గమనించారు. శరీరంపై గాయాలతో బాధపడుతున్న ఆమె సమాచారాన్ని టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లోని ఏయూటీడీ నిరాశ్రయ వసతి గృహానికి తెలియజేశారు. అక్కడ యువతికి తగిన చికిత్స అందజేయడంతో కోలుకుంది. కొండమ్మ నుంచి వివరాలు సేకరించి ఆమె అమ్మమ్మను షెల్టర్‌కు పిలిపించి అప్పగించినట్లు ఏయూటీడీ ప్రతినిధి వాసు తెలిపారు.

కాలుష్య నియంత్రణకు కృషి



తన బంగ్లా నుంచి సైకిల్‌పై జీవీఎంసీకి వస్తున్న కమిషనర్

దాబాగార్డెన్స్: కాలుష్య నియంత్రణ మనందరి బాధ్యత అని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పేర్కొన్నారు. కాలుష్య నియంత్రణలో భాగంగా మేయర్ సోమవారం తమ సొంత వాహనం వదలి క్యాంపు కార్యాలయం నుంచి విద్యుత్ వాహనంలో ప్రయాణించి జీవీఎంసీకి చేరుకున్నారు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తన బంగ్లా నుంచి సైకిల్‌పై జీవీఎంసీకి వచ్చారు. అనంతరం జీవీఎంసీలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమంలో వారిద్దరు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాలుష్య నియంత్రణకు అందరూ సహకరించాలని, సాధ్యమైనంత వరకు ప్రజా రవాణాను, విద్యుత్ వాహనాలను ఉపయోగించాలని కోరారు.

అభివృద్ధి పనులు వేగవంతం

- డిప్యూటీమేయర్ జియ్యాని శ్రీధర్
- 52వ వార్డులో అభివృద్ధి పనుల పరిశీలన



జాతీయ రహదారి వద్ద మరుగుదొడ్ల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న జియ్యాని శ్రీధర్, డీఈఈ ఏడు కొండలు

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డులో చేపట్టిన పలు అభివృద్ధి పనులపై డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ సోమవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించి, అధికారులతో సమీక్షించారు. పనులు వేగవంతం చేయాలని సూచించారు. మర్రిపాలెం వుడాలేఅవుట్, శాంతినగర్, అంబేడ్కర్‌నగర్, కరసా శ్మశాన వాటిక, జాతీయ రహదారిలో బస్‌స్టాప్ వద్ద నిర్మిస్తున్న సులభ్ కాంప్లెక్స్ పనులను పరిశీలించారు. రూ.1.60 కోట్లతో నిర్మిస్తున్న సంజీవయ్యనగర్ రోడ్డు, రూ.12 లక్షలతో నిర్మిస్తున్న అంబేడ్కర్ నగర్ సీసీ డ్రైన్ల నిర్మాణ పనులు, రూ.8.5లక్షలతో నిర్మిస్తున్న సులభ్ కాంప్లెక్స్ పనుల గురించి ఆరా తీశారు. టాయ్‌లెట్లకు మహిళలు, పురుషుల చిత్రాలు కూడా కనిపించే విధంగా ఏర్పాటు చేయాలని సూచించారు. పనులు 70 శాతం పూర్తయ్యాయని త్వరలో ప్రజలకు అందుబాటులోకి తీసుకు వస్తామన్నారు. బీటీ రోడ్డు పనులు 80 శాతం పూర్తయ్యాయని తెలిపారు. హిందూ ముస్లిం, క్రిస్టియన్ శ్మశాన వాటిక అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఇక్కడ పెండింగ్ పనులు పూర్తి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు చెప్పారు. వుడాలే అవుట్‌లో కొన్ని కాల్వలు అభివృద్ధి చేయనున్నట్టు తెలిపారు. నూతనంగా వేసిన బీటీ రోడ్డులో బ్లింకర్స్ వేయాలని అధికారులకు సూచించారు. ఆయనతో పాటు డీఈఈ ఏడు కొండలు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల సమస్యపై వినతి



జేసీ విశ్వనాథన్‌కు సమస్యను వివరిస్తున్న బెహరా భాస్కరరావు

గోపాలపట్నం: జీవీఎంసీ 91, 92వ వార్డుల పరిధిలో ఇళ్ల పట్టాల సమస్యపై సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ విశ్వనాథ్‌కు జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు వినతిపత్రం అందజేశారు. జీవీఎంసీ 92వ వార్డు కంపరపాలెం, మేహాద్రి గెడ్డ కాలనీ, పద్మనాభనగర్, గ్రామాల్లో 40 ఏళ్ల నుంచి నిర్వాసితులుఉంటున్నారన్నారు. అప్పటి ప్రభుత్వం వీరికి పట్టాలు ఇచ్చిందని జేసీకి వివరించారు. కంపరపాలెం సర్వే నంబర్లు 70, 71, 73లో, పద్మనాభనగర్ సర్వేనంబర్ 76, 76ఏలో ఎస్సీబీసీ కాలనీ సర్వేనంబర్ 84లో ఇళ్ల పట్టాలకు, 91వ వార్డు బాజి జంక్షన్‌లో 47వ సర్వేనంబర్‌లో ఇళ్ల పట్టాలు పొందినవారికి ప్రభుత్వం జగనన్న గృహ పథకం ద్వారా ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్ చేయించాలని కోరారు. ఈ పట్టాలు పొందిన వారు జగనన్న గృహ పథకానికి దరఖాస్తు చేసుకుంటే ఆయా స్థలాలు సింహాచలం దేవస్థానం, 22ఏలో ఉన్నాయని గోపాల పట్నం రెవెన్యూ అధికారులు, సచివాలయ కార్యదర్శులు చెబుతున్నారని జేసీకి వివరించారు. వీరికి ప్రభుత్వమే స్థలం కేటాయించిందన్నారు. పూర్తిస్థాయిలో పరిశీలించి ఆయా ప్రాంతాల వారికి తగిన న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో 92వ వార్డు అధ్యక్షుడు అప్పలస్వామి నాయుడు, నాయకులు కంపర కోటేశ్వరరావు, కంప రామకృష్ణ, రాపర్తి అప్పారావు, కంచపాటి నాగరాజు, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన వినతుల పరిష్కారం



అర్జీదారు సమస్యలు తెలుసుకుంటున్న జోన్-5 కమిషనర్ కృష్ణ

కంచరపాలెం: జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్-5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 6 వినతులు అందాయి. అర్జీదారుల వద్ద నుంచి వాటిని జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ స్వీకరించి ఆయా విభాగాల అధికారులకు అందజేశారు. టౌన్ ప్లానింగ్‌కు 3, యూసీడీకి 1, రెవెన్యూకు 01, పబ్లిక్ హెల్త్ విభాగానికి 1 చొప్పున అర్జీలు అందినట్లు జెడ్సీ తెలిపారు. ప్రజా వినతులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

జెడ్సీతో ట్రాఫిక్ సీఐ చర్చ

జెడ్సీ కృష్ణతో కంచరపాలెం ఐదో పట్టణ ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు సమావేశమయ్యారు. జోన్-5 పరిధిలోని రహదారులపై ట్రాఫిక్ రూల్స్‌కు సంబంధించి ఏర్పాటు చేస్తున్న జీబ్రా క్రాసింగ్ లైన్లు, స్పీడ్ బ్రేకర్లు, ఫుట్‌పాత్‌లకు రంగులు తదితర అభివృద్ధి పనులపై చర్చించారు. ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులు సహకారం అందించాలని ఆయనను సీఐ కోరారు. కార్యక్రమంలో జోన్ సూపరింటెండెంట్-1 టి.ఎస్.ఎన్.రాజు, సూపరింటెండెంట్-2 ఆర్.వి.రాజు, రెవెన్యూ ఆర్వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఇంజినీరింగ్ ఈఈ శ్రీనివాసరావు, టి.ప్రసన్నరెడ్డి, పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.సునీల్‌కుమార్, టీపీఆర్‌వో ఏపీడీలు పద్మావతి, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

మహాశివుడికి రుద్రాభిషేకం



కోదండేశ్వరాలయంలో రుద్రాభిషేకం చేస్తున్న అర్చకులు

కంచరపాలెం: శ్రావణ మాస శుద్ధ పంచమి సందర్భంగా సోమవారం స్థానిక శివాలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. కంచరపాలెం మెయిన్ రోడ్డులోని గౌరీశంకరాలయంలో ప్రధాన అర్చకుడు శ్రీనివాస దీక్షితులు, మర్రిపాలెం 104 ఏరియా బాపూజీనగర్ కోదండేశ్వరాలయంలో అనువంశీక ధర్మకర్త ఎడ్ల శ్రీనివాసరావు నేతృత్వంలో ప్రధాన అర్చకులు ఎం.సూర్యప్రకాశ్ శర్మ, ఆంజనేయ శర్మ మహాశివుడికి రుద్రాభిషేకం చేశారు. అనంతరం విభూది అభిషేకం, బిల్వార్చన, పంచామృతాభిషేకం తదితర పూజలు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

టీడీపీ నేతల తీరు విడ్డూరం

- సానుభూతి పరులనే చేర్చుకున్న వైనం
- 59వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పుర్రె సురేష్‌యాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న పుర్రె సురేష్‌యాదవ్

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డులో టీడీపీ నాయకులు తీరును చూసి ఈ ప్రాంత వాసులు నవ్వుకుంటున్నారని వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పుర్రె సురేష్‌యాదవ్ అన్నారు. ఆ పార్టీ సానుభూతిపరులకే పార్టీ కండువాలు కప్పి వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలో చేరారని పత్రికల్లో వార్తలు రాయించుకోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుందని ఎద్దేవా చేశారు. ఆదివారం రాత్రి ఎమ్మెల్యే గణబాబు నిర్వహించిన కార్యక్రమంలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు టీడీపీలో చేరారంటూ అదే పార్టీ సానుభూతిపరులకు కండువాలు కప్పి పత్రికల్లో వార్త వేయించుకున్నారని ఆరోపించారు. ఆ వార్తను ఖండిస్తూ పుర్రె సురేష్ 59వ వార్డు శాంతిగిరికాలనీలోని తన కార్యాలయంలో సోమవారం మీడియాతో మాట్లాడారు. తమ నాయకుడు ఆడారి ఆనంద్‌కుమార్ పశ్చిమలో అడుగు పెట్టిన దగ్గర నుంచి టీడీపీ వారికి నిద్రపట్టడం లేదన్నారు. దీంతో వైఎస్సార్‌సీపీ కేడర్‌ను దెబ్బతీయాలనే కుటిల యత్నమే చేరికల ప్రచారం అని కొట్టిపారేశారు. టీడీపీలో చేరారన్న వారు వైఎస్సార్‌సీపీలో ఎలాంటి పదవులు పొందారో చెప్పగలిగే దమ్ము,ధైర్యం టీడీపీ నాయకులకు ఉందా అని సవాల్ విసిరారు. ఇప్పటికైనా దిగజారుడు రాజకీయాలు మానుకోవాలని ఆయన హితవు పలికారు. సమావేశంలో పార్టీ నాయకులు రేవళ్ల సత్యనారాయణ, తోణంగి వెంకటరమణయాదవ్,సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం ధర్నా



తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

గోపాలపట్నం: నిత్యావసర ధరలు తగ్గించాలని గోపాలపట్నం తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నగర కార్యదర్శి పద్మ మాట్లాడుతూ పెట్రోలు, డీజిల్ ధరలు పెంచడం వల్ల రవాణా ఖర్చులు బాగా పెరిగాయన్నారు. ఆ ప్రభావం నిత్యావసర సరుకులపై పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గోపాలపట్నం జోన్ కార్యదర్శి బలివాడ వెంకటరావు, అప్పారావు, శ్రావణ్, శ్రీనివాసరావు, సత్యనారాయణ, ముద్దాడ వర ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల్లోకి ప్రభుత్వ పథకాలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న కన్నబాబు

మల్కాపురం: గృహసారథులు, సచివాలయాల కన్వీనర్లు తమ పరిధిలోని కార్యకర్తలతో కలిసి ఆయా ప్రాంతాలకు వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించడంతో పాటు వారి సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించే దిశగా అడుగులు వేయాలని మాజీ కార్పొరేటర్ పిల్లా కన్నబాబు అన్నారు. 60వ వార్డు ఇందిరాకాలనీలో సోమవారం గృహసారథులు,సచివాలయాల కన్వీనర్లతో కలిసి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి 95 శాతం వరకు హామీలు నెరవేర్చారన్నారు. అనేక సంక్షేమ పథకాలు పెట్టి సంక్షేమ సారధిగా నిలిచారన్నారు. కొంత మంది సాంకేతిక కారణాల వల్ల కొన్ని పథకాలు అందుకోలేక పోతున్నారన్నారు. అలాంటి వారిని గుర్తించి వారికి ఉన్న అభ్యంతరాలు ఏమిటో గుర్తించి,దానిపై వారికి అవగాహన కల్పించాలని సూచన చేశారు. కార్యకర్తలు ప్రజా సమస్యలు తెలుసుకోవాలన్నారు. సమావేశంలో నాయకులు ఆడారి హరీష్,ఆకుల కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన నేడు

దాబాగార్డెన్స్: బురుజుపేటలో కొలువైన కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగే ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబర్ 060810011006681 టౌన్ కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ చేస్తారు. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లలో సంప్రదించవచ్చు.

19వ రోజుకు శ్రీలక్ష్మీ పూజలు

కనకమహాలక్ష్మి ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా నిర్వహిస్తున్న శ్రీలక్ష్మీ పూజలు సోమవారం నాటికి 19వ రోజుకు చేరాయి. ఉదయం 8 గంటలకు వేదమంత్రాలు, నాదస్వరాల నడుమ ప్రారంభమైన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పోస్టుల ద్వారా వచ్చిన భక్తుల పేరిట పూజలు చేసి కుంకుమ, అమ్మవారి యంత్రం, ప్రసాదం పంపారు. శ్రావణ లక్ష్మీ పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.400 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీష తెలిపారు. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఆలయ ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, ఆలయ సిబ్బంది, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

ఆడారి సొంత నిధులతో పింఛన్లు



పింఛన్లు అందిస్తున్న బెహరా భాస్కరరావు

గోపాలపట్నం: పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయ కర్త ఆడారి ఆనంద్ కుమార్ తన సొంత నిధులతో జీవీఎంసీ 91, 92వ వార్డుల్లో మంజూరు చేసిన కొత్త పింఛన్లను జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు ఆయన ఇంటి వద్ద అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతిక కారణాల వల్ల ప్రభుత్వ పింఛను మంజూరు కాని వారికి ఆనంద్‌కుమార్ సొంత నిధులతో పింఛన్ అందిస్తున్నారని చెప్పారు. లాల్ సురేష్, గొందేశి కనకమ్మ, కటిక పార్థివ్ కుమార్, సీహెచ్ చిన్న అప్పారావులకు రూ. 2750 చొప్పున అందించారు. ప్రభుత్వ పింఛను మంజూరైనంతవరకు ఇలా అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో 91, 92 వ వార్డుల అధ్యక్షులు గుణిశెట్టి శ్రీనివాసరావు, అప్పలస్వామి నాయుడు, నాయకులు దేరెడ్ల సత్యనారాయణ రెడ్డి, గొంతెన శ్రీనివాసరావు, త్రినాథ్, మార్కొండేయ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్ పనులకు భూమిపూజ



భూమి పూజలో పాల్గొన్న బద్రీనాథ్

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు అశోక్‌నగర్ స్లమ్ ఏరియాలో భూగర్భ పైపులైన్ పనులకు సోమవారంవైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్ భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ తాగునీరు మట్టి రంగులో వస్తుండడంతో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా స్థానిక వాసులు వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ దృష్టికి తీసుకువచ్చారన్నారు. స్పందించిన ఆయన సమస్యను జీవీఎంసీ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి రూ.4 లక్షలు మంజూరు చేయించారని బద్రీనాథ్ చెప్పారు. పనులు పూర్తయితే ఈ ప్రాంత ప్రజలకు ఇకపై శుద్ధమైన తాగునీరు సరఫరా అవుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జీఎల్‌వీ నరేష్, మళ్ల ధనలత,ఆడారి హరీష్,బిల్డర్ శ్రీను, కామాక్షి,మనోహర్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

60వ వార్డు పరిధి అశోక్‌నగర్‌లో పైపులైన్ పనులకు వార్డు కార్పొరేటర్ పి.వి.సురేష్ సోమవారం శంకుస్థాపన చేశారు. స్థానిక నివాసీయులు పడుతున్న ఇబ్బందులను గుర్తించి ఇక్కడ పైపులైన్ ఏర్పాటుకు చర్యలు చేపట్టామన్నారు.

పిల్లల్లో నైతిక విలువలు పెంపొందించాలి



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న డిస్ట్రిక్ట్-101 గవర్నర్ శుభ, జయప్రభాశర్మ, సభ్యులు

మురళీనగర్: పిల్లల్లో నైతిక విలువలు పెంపొందేలా తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలని కవయిత్రి, సెయింట్ జోసెఫ్ వుమన్స్ కాలేజీ లెక్చరర్ దేవులపల్లి పద్మజ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం మురళీనగర్ వనితా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్లబ్ అధ్యక్షురాలు విశ్వనాథ జయప్రభాశర్మ అధ్యక్షతన వైశాఖి మహిళా భవన్‌లో ఉత్తమ ఉపాధ్యాయుల సత్కార సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆమె మాట్లాడుతూ నేటి బాలబాలికలను పెద్దల పట్ల గౌరవ భావాలు ప్రకటించేలా పెంచాలని సూచించారు.రిటైర్డ్ ఉపాధ్యాయుడు వెన్నెల సూర్యనారాయణ మాట్లాడుతూ పిల్లల్లో మానసిక పరిపక్వతకు ఉపాధ్యాయులతోపాటు తల్లిదండ్రులు సహకరించాలన్నారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ గ్రహీత, రాంపురం బాలికల జూనియర్ కళాశాల ఇంగ్లిష్ లెక్చరర్(పీజీటీ) కశిరెడ్డి వెంకటరావు మాట్లాడుతూ విద్యార్థులకు దేశ సంస్కృతీ సంప్రదాయాల ప్రాధాన్యాన్ని తెలియజేయాలన్నారు. తెలుగుతోపాటు ఇంగ్లిష్‌లో ప్రావీణ్యం వల్ల ఉద్యోగావకాశాలు మెరుగుపడతాయని చెప్పారు. ఉన్నత విలువలు కలిగిన పౌరులుగా విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులతోపాటు తల్లిదండ్రులు బాధ్యత వహించాలన్నారు. ఈ సందర్భంగా దేవులపల్లి పద్మజ, కశిరెడ్డి వెంకటరావు, వెన్నెల సూర్యానారాయణ మాస్టార్లను వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్-101 గవర్నర్ ఉప్పలపాటి శుభ చేతుల మీదుగా వనితా వాకర్స్ క్లబ్ సభ్యులు ఘనంగా సత్కరించి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను అందజేశారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ,తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. అర్చకులు పెద్దరాజు, శ్రీకాంత్ తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

విద్యార్థులే పాలకులైన వేళ..



సదస్సులో బ్రెజిల్ ప్రధానిని సన్మానిస్తున్న ప్రధాని మోదీగా..



జీ 20 మాక్ సదస్సులో పాల్గొన్న వివిధ దేశాల ప్రతినిధులుగా విద్యార్థులు

- ఉత్సాహంగా 'యువ మంతన్' జీ 20 మాక్ సదస్సు
- ప్రజాప్రతినిధులుగా ఆకట్టుకున్న విద్యార్థులు

అక్కిరెడ్డిపాలెం: మాక్ సదస్సుల ద్వారా విద్యార్థుల్లో విశ్లేషణాత్మక శక్తిని వెలికితీయవచ్చని అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ ప్రధానోపాధ్యాయిని ఎం.ఎల్.ఎస్.కాంతం అన్నారు. జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్‌పై ఆసక్తి పెరుగుతుందన్నారు. ఈ నెల 9, 10 తేదీల్లో న్యూ ఢిల్లీలో జీ-20 సదస్సు జరగనున్న నేపథ్యంలో పాఠశాలలో సోమవారం యువమంతన్ జీ-20 మాక్ సదస్సును నిర్వహించారు. విద్యార్థులు వివిధ దేశాల ప్రతినిధులుగా ఆకట్టుకున్నారు.

'మాక్' సదస్సు సాగిందిలా..

ముందుగా జీ 20 సదస్సుకు హాజరైన అర్జెంటీనా, ఆస్ట్రేలియా, బ్రెజిల్, కెనడా, చైనా, ఫ్రాన్స్, జర్మనీ, ఇండోనేషియా, ఇటలీ, జపాన్, సౌత్‌కొరియా, మెక్సికో, రష్యా, సౌదీ అరేబియా, సౌత్ఆఫ్రికా, టర్కీ, యునైటెడ్ కింగ్‌డమ్, యునైటెడ్ స్టేట్స్ దేశాల ప్రతినిధులకు ఆతిథ్య దేశమైన భారత్ ప్రధాని గౌరవ సూచకంగా శాలువాలతో సత్కరించారు. అనంతరం భారతదేశం ఇప్పటివరకు సాధించిన విజయాలను, అధిగమించిన పరిస్థితులను ప్రధాని మోదీ వివరించారు. కోవిడ్-2019ను ఎదుర్కొన్న తీరుతో పాటు వ్యవసాయ రంగం, వైద్య రంగం, పరిశోధనా రంగాల్లో ప్రగతిని వివరించారు. చంద్రయాన్-3 తో ప్రపంచం యావత్తు భారత్ వైపు చూసే విధంగా చేసిన అంతరిక్ష ప్రయోగాలను తెలియజేశారు. అనంతరం ఆయా దేశాల ప్రతినిధులు తాము సాధించిన విజయాలు, ఆయా దేశాల అభివృద్ధిపై ప్రసంగించారు. విద్యార్థులు ఆయా దేశాల ప్రధానులుగా వేష, భాషలతో అలరించారు. కార్యక్రమానికి రూపకల్పన చేసిన ప్రోగ్రాం ఇన్‌చార్జి కుమారస్వామి, ఉపాధ్యాయులు బి.ప్రసాదరావు, బి.శంకరమ్మ, పద్మజ, జి.పద్మ, సుబ్బలక్ష్మి, రవిచంద్ తదితరులను హెచ్ఎం కాంతం ప్రత్యేకంగా అభినందించారు.